www.kandilinews.com

# కందిలి

న్యూస్.. దారిచూపే దీప శిఖ

శుక్రవారం | 29.05.2026 సంపుటి: 01 | సంచిక: 261 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800



మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి



# ఆఖరి ప్రయాణం.. అంతిమ సంస్కారం!

## అనాథ మృతదేహాలకు అన్నీ తామై అంత్యక్రియలు జరిపిస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్

- ఇప్పటి వరకు 692 అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు
- పటాన్ చెరు ప్రాంతంలో విశిష్టం సేవలందిస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్
- మానవత్వాన్ని చాటుతూ కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు
- ఎవరూ లేని వారికి ఆ నలుగురు తామై నిలుస్తున్న తీరు

2 లో

# నక్కవాగు తీరం.. మాఫియాదే రాజ్యం!



- రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి, ఇసుక తరలింపు
- దందా సాగిస్తున్న వారికి పుష్కలంగా నేతల అండదండలు
- కనీస చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న ప్రభుత్వ విభాగాల అధికారులు
- ఎడాపెడా తవ్వకాలతో రోజురోజుకు కనుమరుగవుతున్న నక్కవాగు
- వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ... దర్జాగా సంపాదించేస్తున్న కేటుగాళ్లు
- హత్నూర మండలం గుండ్లమాచనూరు పరిధిలో ఇదీ పరిస్థితి

3 లో







# ఆఖరి ప్రయాణం.. అంతిమ సంస్కారం!

- అనాథ మృతదేహాలకు అన్నీ తామై అంత్యక్రియలు జరిపిస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్
- ఇప్పటి వరకు 692 అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు
- పటాన్ చెరు ప్రాంతంలో విశిష్టం సేవలందిస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్
- మానవత్వాన్ని చాటుతూ కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు
- ఎవరూ లేని వారికి ఆ నలుగురు తామై నిలుస్తున్న తీరు

**కందిలి, పటాన్ చెరు**

పటాన్ చెరు ప్రాంతంలో ఎండీఆర్ ఫౌండేషన్ విశిష్ట సేవలందిస్తోంది. భిన్న రకాల కార్యక్రమాలు చేపడుతూ ఆపన్నులకు అండగా ఉంటోంది. ఆపద వచ్చిందంటే చాలు.. మేమున్నామని ఈ సంస్థ ప్రతినిధులు ముందుకొస్తున్నారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం అందరి చేత ప్రశంసలు అందుకుంటోంది. పొట్టకూట కోసం ఎక్కడెక్కడి నుంచే వచ్చి, చివరకు అనాథలుగా ప్రాణాలు విడుస్తున్న వారి అంత్యక్రియలను అన్నీ తామై నిర్వహిస్తున్నారు. ఆఖరి ప్రయాణం కూడా గౌరవంగా ఉండాలనే లక్ష్యంతో ఈ సేవ మొదలు పెట్టామని ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మధుసూదన్ వివరిస్తున్నారు.

**692 అనాథ మృతదేహాలకు!**

ఇప్పటి వరకు ఈ ఫౌండేషన్ ద్వారా 692 అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి. పటాన్ చెరు ప్రాంతానికి ఎక్కడెక్కడి నుంచో చాలా మంది వలస వస్తుంటారు. ఇక్కడే కూలీనాలీ చేస్తూ బతుకుతుంటారు. ఈ క్రమంలో చాలా మంది ఒంటరివాళ్లయిపోతున్నారు. ఇలాంటి వారు చనిపోతే, వారి ఆప్తులు ఎవరనేది తేలకపోతే పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్ వారికి సమాచారమిస్తుంటారు. వివరాలు అందడమే ఆలస్యం.. ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు వెళ్లి అంతిమ సంస్కారాలు పూర్తి చేస్తారు.

**తీవ్ర పేదరికం కారణంగానూ!**

బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి చాలా మంది పని వెతుక్కుంటూ వస్తారు. ఇలాంటి వారు చనిపోయిన సందర్భంలో, వారి బంధువులు, కుటుంబసభ్యులున్నా... అంత్యక్రియలు కూడా చేయలేని దుర్భర పరిస్థితి ఉంటుంది. అలాంటి సమయంలోనూ ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మానవత్వాన్ని చాటుకుంటున్నారు. అన్నీ తామై అంత్యక్రియలు చేయిస్తున్నారు.

**చివరి ప్రయాణం... గౌరవంగా ఉండాలనే లక్ష్యం!**

అనాథ శవాలకు అంతిమసంస్కారం చేసేందుకు సాధారణంగా ఎవరూ ముందుకు రారు. మనకెందుకులే అని వదిలేస్తారు. కానీ ఎండీఆర్ ఫౌండేషన్ మాత్రం ప్రతి మనిషి చివరి ప్రయాణానికి కూడా గౌరవం దక్కాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. మృతులకు సంబంధించిన వివరాలు సేకరించి, పోలీసుల సహకారంతో అన్ని నిబంధనలు పాటిస్తూ, వారిని తమ కుటుంబ సభ్యులుగా భావించి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.



**ఆఖరి ప్రయాణంలో.. అనాథలుగా మిగిలిపోకూడదు!**

**- మధుసూదన్, అధ్యక్షుడు, ఎండీఆర్ ఫౌండేషన్**

**ఎండీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ మాద్రి దేవేందర్ రాజు, కో–ఫౌండర్ మాద్రి ప్రిథ్వీరాజ్ ఆర్థిక సహాయ సహకారాలు, వారిచ్చిన స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. మనిషి చనిపోయిన తర్వాత కూడా అతనికి గౌరవం దక్కాలనే భావనతో ఈ పని చేస్తున్నాం. సమాజంలో ఎవరు ఒంటరివారు కారని, అనాథలకు కూడా మనం అండగా ఉండాలనే మానవత్వ సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నాం.**





# నక్కవాగు తీరం..
# మాఫియాదే రాజ్యం!



- **రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి, ఇసుక తరలింపు**
- **దందా సాగిస్తున్న వారికి పుష్కలంగా నేతల అండదండలు**
- **కనీస చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న ప్రభుత్వ విభాగాల అధికారులు**
- **ఎడాపెడా తవ్వకాలతో రోజురోజుకు కనుమరుగవుతున్న నక్కవాగు**
- **వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ... దర్జాగా సంపాదించేస్తున్న కేటుగాళ్లు**
- **హత్నూర మండలం గుండ్లమాచనూరు పరిధిలో ఇదీ పరిస్థితి**

**కందిలి, హత్నూర**

రాత్రి, పగలు తేడా లేదు. అధికారులు చర్యలు తీసుకుంటారనే భయమూ వారిలో కానరాదు. మట్టిని తవ్వాలి. ఇసుకను తీయాలి. దర్జాగా అక్రమ దందా సాగించాలి. రాజకీయ నాయకుల అండ కూడా ఉంది. ఇక మాకేం భయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు కొందరు కేటుగాళ్లు. వాల్టా చట్టానికీ తూట్లు పొడుస్తూ, ఇసుక రవాణా సాగిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచనూరు గ్రామ పరిధిలో ఇదీ పరిస్థితి. నక్కవాగు ఉనికి ప్రశ్నార్థకం చేసేలా సాగుతున్న ఈ మట్టి, ఇసుక దందాలపై "కందిలి" అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

**యథేచ్ఛగా సాగుతున్న దందా!**

హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని నక్కవాగు సమీపంలో అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. స్థానికంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. కొందరు వ్యక్తులు రాజకీయ నాయకుల అండదండలతో యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తున్నారు. లక్షల్లో ఆర్జిస్తున్నారు. అధికారులు సైతం వారి వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్లుగా నడుస్తోంది.

**నక్కవాగు ఆనవాళ్లు లేకుండా చేసేలా!**

పటాన్ చెరు నుంచి హత్నూర మీదుగా నక్కవాగు ప్రవహిస్తుంది. చివరకు మంజీరాలో చేరుతుంది. ఇప్పటికే నక్కవాగు నీరంతా కలుషితమైపోయింది. మట్టి, ఇసుక అక్రమంగా తోడేస్తుండటం వల్ల వాగు ఆనవాళ్లు కోల్పోతోంది. వాగుకు రెండు వైపులా భారీయంత్రాల సాయంతో మట్టిని తవ్వుతున్నారు. దానిని నీళ్లతో కడిగి ఇసుక తీస్తున్నారు. బహిరంగ మార్కెట్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఈ దందా సాగుతున్నా, అధికారులు దీనిని పట్టించుకోవడం లేదు. వారి వ్యవహార శైలి ఆరోపణలకు తావిచ్చేలా ఉంది.

**భారీ యంత్రాల సాయంతో..!**

భారీ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల సహాయంతో నక్కవాగు పరిసర ప్రాంతాల్లో మట్టి, ఇసుకను తవ్వి ఇస్మాయిల్ ఖాన్ పేట్ శివారు ప్రాంతానికి తరలిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. వాల్టా చట్టాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ జరుగుతున్న ఈ తవ్వకాలపై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

భారీ తవ్వకాలతో నక్కవాగు పరిసరాల్లో లోతైన గుంతలు ఏర్పడి భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాగు ప్రవాహం మారిపోయి సమీప పంట భూములు దెబ్బతినే పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.

**ఫిర్యాదు చేసినా.. చర్యలు లేవు!**

ఈ వ్యవహారంపై పలుమార్లు రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే అక్రమ తవ్వకాలను నిలిపివేసి ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే గ్రామస్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిస్తారో, లేదో వేచి చూద్దాం.





# సదాశివపేట పట్టణ.. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జిగా

- **తోపాజి అనంత కిషన్!**
- **నియమించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



**కందిలి, సంగారెడ్డి:** సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పూర్తి స్థాయి ఇన్చార్జిగా, మున్సిపల్ వ్యవహారాల ఇన్చార్జిగా తోపాజి అనంత కిషన్ ను నియమించినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పట్టణ కమిటీ నియామకం, మున్సిపల్ వ్యవహారాల బాధ్యతలు ఆయనకు అప్పగించామని జగ్గారెడ్డి వివరించారు. సమన్వయ కర్తలుగా సీడీసీ ఛైర్మన్ కంబాలపల్లి రాంరెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్ సిద్దన్న, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులుతో కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా తోపాజీ అనంతకిషన్ కు ఆయన సూచించారు. తోపాజీ అనంతకిషన్ ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పార్టీ బలోపేతం కోసం అన్ని కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా జగ్గారెడ్డి ఆయనకు సదాశివపేట బాధ్యతలు అప్పగించారు.



# కాంగ్రెస్ పార్టీ... సంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మనుగా గాంగేరి శ్రీహరి!

- **రాహుల్ గాంధీ సమక్షంలో నియామక పత్రం స్వీకరణ**



**కందిలి, సంగారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మనుగా సంగారెడ్డి పట్టణానికి చెందిన గాంగేరీ శ్రీహరి నియమితులయ్యారు. దిల్లీలోని ఇందిరాభవన్లో గురువారం నిర్వహించిన అఖిల భారత దళిత కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యారు. రాహుల్ గాంధీ సమక్షంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్ర పాల్ గౌతమ్, జాతీయ సలహాదారు కొప్పుల రాజు, ఎస్సీ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కవంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. రోజురోజుకు ఇవి పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దళితులకు జరిగే అన్యాయాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. దళిత, గిరిజనులకు రక్షణగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని వివరించారు. కాంగ్రెస్ పార్టీ దళితుల పక్షపాతి అని ఆయన స్పష్టం చేశారు.




# రాజకీయ దురుద్దేశంతోనే... ఈడీ దాడులు!

- **కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ పై ఈడీ దాడులను ఖండించండి**
- **బురదజల్లే విధానాలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మానుకోవాలి**
- **సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.సాయిలు**
- **ఈడీ దాడులను నిరసిస్తూ సంగారెడ్డిలో పార్టీ శ్రేణుల కార్యక్రమం**

**కందిలి, సంగారెడ్డి**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పై రాజకీయ దురుద్దేశంతోనే ఈడీ దాడులు జరుగుతున్నాయని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.సాయిలు ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అపవిత్ర కూటమి బురదజల్లే విధానాలు మానుకోవాలని అన్నారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ పై ఈడీ దాడులను నిరసిస్తూ సంగారెడ్డిలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

**ఎన్ని దాడులు చేసినా.. భయపడే ప్రసక్తే లేదు!**

ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థులను వేటాడేందుకు కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించే బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు పద్ధతిలో వ్యవహరిస్తుందన్నారు. ఆ రాష్ట్రంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కూడా బీజేపీకి అనుసంధానంగా పనిచేస్తుందన్నారు. పినరయి విజయన్ నివాసంలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ చర్యలు రాజకీయ కక్షసాధింపులో భాగమమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య అపవిత్ర కూటమికి నిదర్శనమన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రణాళికాబద్ధమైన చర్యకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఈ కుట్రలకు సీపీఎం బెదిరేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, అర్జున్,లక్ష్మణ్, దత్తు, మంజుల, విఠల్, మల్లారెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.







# భక్తిశ్రద్ధలతో... బక్రీద్!



*** ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు**
*** వారికి శుభాకాంక్షలు తెలిపిన వివిధ పార్టీల నేతలు**

**కందిలి, సంగారెడ్డి:** బక్రీదు పండుగను ముస్లిం సోదరుల భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేలాదిగా ఒకే చోటకు చేరి ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ చోట్ల నిర్వహించిన ప్రార్థనల్లో స్థానిక రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరై బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. బక్రీద్ పర్వదిన వేడుకలకు సంబంధించిన చిత్రాలు మీకోసం.







# ప్రభుత్వ వైఫల్యం వల్లే..ధాన్యం వర్షం పాలయిన పరిస్థితి!

- **కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో అన్నదాతల అరిగోస**
- **కొనుగోళ్ల విషయంలో అధికారుల తీవ్రస్థాయి నిర్లక్ష్యం**
- **తక్షణమే వడ్ల కొనుగోళ్లలో వేగం పెంచేలా చర్యలుండాలి**
- **ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**

**కందిలి, సంగారెడ్డి:** ప్రభుత్వ వైఫల్యం వల్లనే వేలాది క్వింటాళ్ల వరి ధాన్యం వర్షం పాలయ్యే పరిస్థితి దాపురించిందని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ విమర్శించారు. వర్షం ధాటికి నష్టపోయిన వరిధాన్యాన్ని చౌటుకూరు మండలంలోని శివంపేటలో చంటి క్రాంతి కిరణ్ పరిశీలించారు. ఆందోల్ నియోజకవర్గంలోని పుల్కల్, ఆందోల్, చౌటకూర్, వట్పల్లి, టేక్మాల్, అల్లాదుర్గ్ మండలాల్లో కొన్ని వేల ఎకరాల్లో పండిన వరి పంటను సకాలంలో కొనకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు. సీజన్లో ఎంత ధాన్యం ఉత్పత్తి అవుతుంది? దాన్ని ఎలా కొనుగోలు చేయాలి? అనేదానికి అనుగుణంగా ట్రాన్స్పోర్ట్ వ్యవస్థను, గన్నీ బ్యాగులను రెడీగా ఉంచుకొని యంత్రాంగాన్ని సమాయత్తం చేయకపోవడం, వారికి ఎప్పటికప్పుడు సరైన గైడెన్స్ ఇవ్వకపోవడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. పంటపెట్టినప్పటి నుంచి పండించిన పంటను అమ్ముకునే వరకు రైతులు ఎంతో ప్రేమగా చూసుకుంటారు కానీ ప్రభుత్వ మాత్రం రైతులు పండించిన పంట నాశనం చేయడానికే శీతకన్నుతో వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో గెలవడానికి రైతులకు మాయమాటలు చెప్పిన మంత్రి రాజనర్సింహ ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

**తడిసిన ధాన్యాన్ని..**
**వెంటనే కొనుగోలు చేయాలి!**

వర్షాలు ముంచుకొస్తున్నాయి, వర్షం పడితే కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి పాడయ్యే అవకాశం ఉందని రైతులు మొరపెట్టుకున్నా, మేము ఎన్నిసార్లు హెచ్చరించినా కూడా అధికారులు ప్రభుత్వం పెద్దలు పట్టించుకోకపోవడమే వల్లనే ఇప్పుడు వర్షానికి పంట నష్టం జరిగిందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ తడిసిన సంచిలోంచి, 10 కిలోలను తీసేసి కొనుగోలు చేస్తూ రైతుకు నష్టం చేకూర్చున్నట్టు రైతులు వాపోతున్నారని ఆయన అన్నారు. వెంటనే ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే సూచన ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన నియోజకవర్గంలో ఇంకా సేకరించాల్సి ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. క్రాంతి కిరణ్ తో పాటు డీసీసీబీ మాజీ ఛైర్మన్ జైపాల్ రెడ్డి,చౌటకూరు, పుల్కల్ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శివకుమార్, విజయకుమార్ లతో పాటు దర్శన్ రెడ్డి, రాములు, మల్లేశం, శ్రీనివాస్, అశోక్ తదితర నాయకులు ఉన్నారు.





Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com